: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231





# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు


సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 9 | 30-11-2020 | పుటలు : 4


## రాజ్యాంగ ఫలాలను అందుకోవాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**మీడియా సెల్, 26.11.20** భారత రాజ్యాంగం అందించిన ఫలాలను ప్రజలందరూ అందుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భారత రాజ్యాంగ నమూన ప్రతి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ విశ్వవిద్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించదగిన గొప్ప రాజ్యాంగం భారత రాజ్యాంగమని అన్నారు. వివిధ జాతులు, కులాలు, మతాలతో ఉన్న భారత ప్రజలను సమాన భావనలోనికి తీసుకుని వచ్చి ఒకే రాజ్యాంగాన్ని రూపొందించడం అనేది చాలా కష్టమైన ప్రక్రియ అని దానిని పరిష్కరించిన మహానీయుడు బాబాసాహేబ్ అంబేద్కర్ అని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రజలందరికి సమాన భావనలోనికి తీసుకువచ్చిందని చెప్పారు. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక గణతంత్రంగా ఉందని తెలిపారు. దేశంలోని ప్రజలందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ, ఆలోచన, భావ ప్రకటన వంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. రాజ్యాంగం దేశ ప్రజలందరికీ ఇచ్చిన ఫలాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్. టేకి, డా. రమణేశ్వరి, డా. వి. పెర్సిస్, డా. కె. సుబ్బారావు, ఆచార్య వై. శ్రీనివాసరావు, డా. ఎ. మట్టారెడ్డి, ఆచార్య పి. సురేష్ వర్మ, డా. ఎం. గోపాలకష్ణ, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళిసర్పిస్తున్న వీసీ


## యునిక్ రాజ్యాంగం : ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్‌లో వీసీ



ప్రోగ్రామ్ అధికారుల సమావేశంలో వీసీ మొక్కా జగన్నాథరావు

**మీడియా సెల్, 26.11.20** భారత రాజ్యాంగం అపూర్వమైన శక్తి కలిగిన రాజ్యాంగమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు నుండి ప్రోగ్రామ్ అధికారులతో ఆన్ లైన్ లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం నుండి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో నుండి ప్రోగ్రామ్ అధికారులతో ఆన్ లైన్ లో భారత రాజ్యాంగ ప్రమాణాన్ని చేయించారు. వీసీ మాట్లాడుతూ భారతరాజ్యాంగం ఎంతో శక్తివంతమైన రాజ్యాంగమని అన్నారు. ధృడమైన రాజ్యాంగ వ్యవస్థ భారతదేశానికి ఉందని చెప్పారు. భారత ప్రజలకు కావల్సిన స్వేచ్ఛా స్వాతంత్రాలను అందించడంతో పాటు పటిష్టమైన న్యాయ వ్యవస్థను రూపొందించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అసెంబ్లి పార్లమెంటు చట్టసభలు, హైకోర్టు సుప్రీం కోర్టు వంటి న్యాయ స్థానాలు భారతదేశంలో ఉన్నాయని చెప్పారు. ప్రపంచంలోని ఎన్నో ప్రత్యేకతలు కలిగిన అతిపెద్ద రాజ్యాంగం భారత ప్రజలకు ఉందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ దేశ సర్వభౌమాధికారన్ని కాపాడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కో.ఆర్డినేటర్ డా. బి. కెజియారాణి, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, ఉభయ గోదావరి జిల్లాల ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

## కాంతిరేఖ



భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ప్రజలు దళిత నాయకునిగా తమ హృదయంలో ప్రతిష్టించుకున్నారు. అయితే కేవలం దళితుల నాయకుడే కాదు. ఆయన ఒక జాతీయ వ్యక్తి. యావత్ దేశపు సందర్భంలోనూ , భారతదేశ చరిత్ర సందర్భంలోనూ సమాజం గురించి ఒక మహత్తరమైన ఆలోచనను ప్రసాదించిన మహాపురుషుడు. డాక్టర్ అంబేద్కర్ విద్వాంసుడు, న్యాయవేత్త, రాజనీతి పారంగతుడు, సంఘ సంస్కర్త, విద్యావేత్త మరియు దేదీప్యమానంగా వెలిగే సూర్యునిలా ఆయన నవతరం ఎదుట ఉదయించాడు.

ప్రజాస్వామ్య జీవనపు విలువలను అంగీకరించి సంఘాన్ని మార్చాలని ఆయన ప్రయత్నించారు. సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాత్రం మూడింటిని ఆరాధించే భారతదేశంతో సంబంధం ఉన్న బౌద్ధమతాన్ని ఆయన స్వీకరించారు. ఆయన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాంఘిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దాలన్న కలని అందరి ముందు ఉంచారు. వెయ్యి పగుళ్ళతో ఉన్న భారతదేశం అనే భవనాన్ని పునరుదరిద్దామని ఆయన ప్రయత్నించారు. ఆయన భారతదేశానికి రాజ్యాంగం రూపంలో ఓ దేవాలయాన్ని ఇచ్చారు.ఆ దేవాలయాన్ని నడిపే పూర్తి బాధ్యత ప్రజలందరిదీనూ.

**— నన్నయ వాణి.**

## ఏయూ వీసీ ని మర్యాదపూర్వకంగా కలసిన నన్నయ వీసీ జగన్నాథరావు




**మీడియా సెల్, 28.11.20,** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఆంధ్ర, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను, అభివృద్ధి కార్యక్రమాలను గురించి చర్చించారు. రాష్ట్రంలోని ఉన్నత విద్య అభివృద్ధికి కలసి పని చేద్దామని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ మొక్కా జగన్నాథరావు అందజేసారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలకమైన వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ పదవులను చేపట్టిన తొలి వ్యక్తిగా, విద్యావేత్తగా, ఉత్తమ పరిశోధకులుగా ప్రసాదరెడ్డి ఉన్నారని అన్నారు. విశ్వవిద్యాలయ క్రమశిక్షణకు, విద్యార్థుల సంక్షేమానికి, నూతన ఆవిష్కరణలకు ప్రసాదరెడ్డి ప్రాధన్యతనిస్తున్నారని తెలిపారు. శతవసంతాలలోనికి అడుగుపెడుతున్న ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధిలోనికి తీసుకువెళ్ళాలని ఆకాంక్షించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నూతన పాలనలో ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేసారు.

## మంచి మాట

**దుర్జన పరిహర్తవ్యో**
**విద్యయా అలంకృతోపిసన్ ।**
**మణినా భూషిత్త సర్ప**
**కిమసౌ న భయంకర్ల ॥**

పడగ మీద మణి కలదైనను పాము భయంకరము, ప్రమాదకరమైనది. విద్య కలవాడైనను దుర్జనునికి దూరంగా ఉండాలని తాత్పర్యం.

## సంపాదకీయం

# కాలం - కర్తవ్యం



ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రపంచాన్ని వెలిగించాను. ఇప్పుడు అస్తమిస్తున్నాను. నా బాధ్యత ఎవరు తీసుకుంటారు' - అని అడిగాడు సూర్యుడు. 'నేను తీసుకుంటానుస్వామీ !' - అంది చిన్న దీపం ! ఇది గురుదేవులు రవీంద్రులు మనకిచ్చిన సందేశం ! చీకటిని తిడుతూ కూర్చునేకంటే చిన్న దీపాన్ని వెలిగించమని. సూర్యుడు, భూమి తమ కర్తవ్యాన్ని తాము నిరంతరాయంగా నిర్వహిస్తున్నాయి. అంతెందుకు విశ్వంలో ప్రతీది అంతే - ప్రకృతీ అంతే ! సృష్టిలో కంటికి కనిపించని కాలం నిశ్శబ్దంగా సాగిపోతూ తనపని తాను చేసుకు వెళుతుంది. సూర్యాస్తమయాలు ఒక్కటే కంటికి కనిపించేవి.

'కాలానికి ఒక రూపం లేదు, దానికి పాపం లేదు. కాలం అద్దం లాంటిది. అంధయుగమైనా, స్వర్ణయుగమైనా అది మన ప్రతిబింబం ' అన్నారు అమృతం కురిసిన రాత్రి సంకలనంలో తిలక్. కాలంకంటే చిత్రమైంది ఏముంది. కాలాన్ని విశ్లేషించని తాత్త్వికుడు, స్మరించని కవీ ఈలోకంలో లేరు. కాలచక్రం తిరిగిపోతూ ఉంటుంది. దానిక్రింద ఎన్ని రాజ్యాలు, రాజులు, చక్రవర్తులు, ప్రభుత్వాలు, అధికారాలు, అహంకారాలు నలిగిపోయాయో ! రాజ్యాన్ని, ధనాన్ని వారంతా కూడా తీసుకుని వెళ్ళారా ? అని ప్రశ్నిస్తారు భాగవతంలో బమ్మెర పోతన.

' గుప్పిటలో ఇసుకలాగ జారిపోవు కాలం' - అన్నారో సినీకవి. గణాంకాలతో నిగ్గుతేల్చి కనిపించని కాలాన్ని సాపేక్ష సిద్ధాంతం ద్వారా శాస్త్రబద్ధం చేశాడు ఐన్‌స్టైయిన్ మహానుభావుడు. పోగుచేస్తే పైసలు రూపాయలుగా, వేలు లక్షలుగా అవుతాయంటారు పెద్దలు. అది నిజమే. మరి కాలంకూడా అంతే కదా ! సెకన్లని, నిమిషాలని ఆదా చేస్తే 'కొన్ని గంటలు' మన ఆధీనంలో ఉంటాయి. అప్పుడు సమయం సద్వినియోగం అవుతుంది. సమయాన్ని విద్యగా, శ్రమగా, ధనంగా, కర్తవ్యం (డ్యూటీ) గా తర్జుమా చేసుకోవటమొక్కటే మన చేతుల్లో ఉంది. కాలాన్ని వెనక్కి తీసుకొని రావటం, సృష్టించి ఇవ్వటం ఎవ్వరి చేతుల్లో లేదు ; వెళ్ళిపోయిన క్షణం తిరిగిరాదని అందరికీ తెలుసు. విలువైన కాలాన్ని -

**' మనకు నిర్ణయింపబడిన పనిని మనం చేయటానికి,**
**మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించటానికి'**
**సద్వినియోగం చేసుకుంటే జీవితాన్ని సఫలం చేసుకున్నట్లే.**

## యూజీసీ కోర్సుల దరఖాస్తులకు గడువు పెంపు

**మీడియా సెల్, 25.11.20** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యూజీసీ-ఎన్.ఎస్.క్యు.ఎఫ్ లో 9 కోర్సుల అడ్మిషన్స్ దరఖాస్తు గడువును పొడిగించామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ విడుదల చేసారు. దీనిపై వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్(ఎన్.ఎస్.క్యు.ఎఫ్)కు సంబంధించిన 9 కోర్సులను ప్రారంభించామని అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానంలో అడ్మిషన్స్ ప్రక్రియను జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ ను సందర్శించవచ్చు.

## విజ్ఞానంతో గ్రామాలను అభివృద్ధి చేద్దాం : వీసీ

**మీడియా సెల్, 23.11.20** గ్రామీణ ప్రాంతాలలో సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకొని వ్యాపార నైపుణ్యాలను, పెట్టుబడులను అభివృద్ధి పరచి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను సోమవారం ప్రారంభించారు. కేస్ డిస్కషన్ మెథడాలజీ అనే అంశంపై జరిగే ఈ ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా ఆచార్య చేతన్, ఆచార్య ఎస్.టేకి వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు.

వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాయానికి మరియు మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ కు మధ్య విద్యాపరమైన, పరిశోధనపరమైన అవగాహన ఒప్పందం జరిగిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ సంబంధిత రంగంపై ఆధారపడి జీవిస్తున్నవారు ఎక్కువమంది ఉన్నారని, వారికి వ్యాపార నైపుణ్యాలను పెట్టుబడి పద్ధతులను నేర్పించడం ద్వారా చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. నేటికి 68 శాతం వ్యవసాయ సంబంధిత రంగాలలోనే ఉన్నారని జాతీయ స్థూల ఉత్పత్తి శాతం తక్కువగా ఉందని



చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలోని ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ లలో ఎగుమతులు చేసే విధంగా దళారీ వ్యవస్థను నిర్మూలించి వ్యాపార లావాదేవీలను నిర్వహించే సామర్థ్యం గ్రామీణ ప్రాంతాల వారికి కల్పించాలని అన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామస్వరాజ్యం సాధించేందుకు మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ తో కలిసి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పని చేస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుండి అధ్యాపకులు అధిక సంఖ్యలో దీనిలో హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ చైర్మన్ డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు ఆచార్య చేతన్, ఆచార్య ఎస్.టేకి మరియు విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.జి.ఎన్.సి.ఆర్.ఈ తో నన్నయ ఎంఓయు



**మీడియా సెల్, 28.11.20** కేంద్ర మానవ వనరుల శాఖ (విద్యాశాఖ)లో భాగస్వామ్యమైన మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆచార్యులు ఎస్.టేకి హైదరాబాద్ లోని ఎం.జి.ఎన్.సి.ఆర్.ఈ కార్యాలయంలో ఎంఓయు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ చైర్మన్ డా.డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్, డైరెక్టర్ ఆచార్య సిహెచ్.చేతన్ మరియు విశ్వవిద్యాలయం నుండి ఆచార్య ఎస్.టేకి లు అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ ఎంఓయు ద్వారా విద్యాపరమైన, పరిశోధనపరమైన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లు, సదస్సులు నిర్వహించడం మరియు గ్రామీణ యువతను పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ తరగతులను అందిస్తారు. భారతదేశంలో గుజరాత్ రాష్ట్రంలో మాత్రమే ఉన్న ఎంబీఏ రూరల్ మేనేజ్మెంట్ కోర్సును నన్నయ విశ్వవిద్యాలయం ప్రారంభించడం, బిబిఏ రూరల్ మేనేజ్మెంట్ కోర్సును అనుబంధ కళాశాలల ద్వారా అందించడం జరుగుతుంది. దీని ద్వారా ప్రత్యేక జాయింట్ పి.హెచ్.డి, ప్రోగ్రామ్ లు అందించనున్నారు. విశ్వవిద్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెంటర్ ను, పండిట్ మదన్ మోహన్ మాలవ్యా టీచర్స్ అండ్ టీచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి దానికి అవసరమైన వనరులను, వసతులను సమకూర్చి గ్రామీణ విద్యాభివృద్ధికికృషి చేయానున్నారు. నన్నయ విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా గ్రామీణ విద్యాభివృద్ధికి, తోర్పాటునందిస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆకాంక్షించారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**మీడియా సెల్, 27.11.20** మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విజ్ఞానంలోను అభివృద్ధిని సాధించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం రిసెర్చ్ ఇష్యూస్ ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై అంతర్జాతీయ ఆన్ లైన్ సెమినార్ ను నిర్వహించారు. దీనికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు టి.త్రిత్వజ్యోతికిరణ్ కన్వీనర్ గా, వెబ్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు కోకన్వీనర్ గా వ్యవహరించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. నైపుణ్యాలను మెరుగుపర్చడానికి వాస్తవ ప్రపంచ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ఉత్తమ మార్గమని అన్నారు. సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మకంగా మార్చాలని చెప్పారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ 21 వ శతాబ్దంలో సంచలనం సృష్టించిందని అన్నారు. నేటి కాలంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ప్రధాన వక్తలుగా జె.ఎన్.టి.యూ. హైదరాబాద్ సహాయాచార్య



డా.ఎ.కవిత, సొల్యూషన్ ఆర్కిటెక్ట్ ఐటిటి సింగపూర్ చాగంటి సురేష్ నాయుడు ఉపన్యాసాలు అందించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ టి.త్రిత్వజ్యోతికిరణ్, కోకన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఐ.ఎస్.ఓ ట్రైనింగ్ ను పరిశీలించిన వీసీ



**మీడియా సెల్, 27.11.20** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ సర్టిఫికేషను సాధించేందుకు సిబ్బంది అంతా చురుగ్గా పని చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఐ.ఎస్.ఓ ఇంటర్నెల్ ఆడిటింగ్ కమిటీ శిక్షణ కార్యక్రమాన్ని కంప్యూటర్ సెంటర్ లో నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అంతర్గత ఆడిటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి విశ్వవిద్యాలయ నాణ్యత ప్రమాణాలను తెలుసుకోనేందుకు ఈ అంతర్గత ఆడిటింగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఐ.ఎస్.ఓ గుర్తింపుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి, నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వీసీ స్థాయి నుండి నాల్గవ స్థాయి సిబ్బంది వరకు అందరూ ఈ ఆడిటింగ్ పరిధిలోనికి వస్తారని చెప్పారు. ఐ.ఎస్.ఓ గుర్తింపు సాధించేంత వరకూ అందరూ పూర్తిగా సహకరించాలని అన్నారు. తద్వారా నాక్ గుర్తింపు సాధన సులభతరం అవుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగమైన ఈ కార్యక్రమానికి అందరూ సహకారం అందించాలని, ఐ.ఎస్.ఓ బృందం చురుగ్గా పని చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డా.కె.దీప్తి, బాలకృష్ణ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## సైకాలజీలో మాస్టర్



**స్ఫూర్తి**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సైకాలజీలో మాస్టర్ చేయడం ఆనందమైన విషయం అని చెప్పాలి. ఎందుకంటే అక్కడ చదవకుండా ఉన్నట్లయితే నేను చాలా మిస్ అయి ఉండి ఉండేవాడిని, ముఖ్యంగా నాకు సైకాలజీ చదవాలని అనిపించినప్పుడు నా యొక్క సొంత ప్రోద్భలంతోనే దాన్ని ఎంచుకున్నాను. ముఖ్యంగా డాక్టర్ రాజశేఖర్ గారు, డాక్టర్ రవి శంకర్ గారు ,డాక్టర్ మణి రమణ మేడం, భవాని మేడం చాలా ఈజీగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు మాకు బోధించేవారు. పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా ప్రాక్టికల్స్ లోనూ సైకాలజికల్ టెస్టింగ్ లోను కూడా మాకు ఎంతగానో ఇంట్రెస్ట్ కలిగేలా ఎక్కువ టెస్టులు చేయించేవారు. అలాగే ప్రాక్టికల్స్ కి బయటకి స్కూల్స్ కి గాని హాస్పిటల్స్ గాని వెళ్లే విధంగా ఏర్పాటు చేసి మాకు ఎక్స్పోజర్ ఎక్కువగా వచ్చేలా చూసేవారు. రాజశేఖర్ గారు బోధించిన రీసెర్చ్ మెథడాలజీ, భవాని మేడం బోధించిన హెల్త్ సైకాలజీ ,మణి రమణ మేడం బోధించిన కౌన్సిలింగ్ సైకాలజీ ,రవిశంకర్ గారు బోధించిన సోషల్ సైకాలజీ ఇప్పటికీ మా మెదడులో అలానే మెదులుతూ ఉన్నాయి .అలాగే నేను ఇప్పుడు జాబ్ లో బిజీగా ఉన్నా కానీ అదే నేనిప్పుడు పి.హెచ్.డి లో సీటు సంపాదించడానికి చాలా ఉపయోగపడింది.

2015 నుంచి 2017 వరకు నా యొక్క పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది. చాలా ఇష్టపడి ప్రేమతో చదివాను కాలేజీ పూర్తయిన తర్వాత కూడా మా ఫ్యాకల్టీ రాజశేఖర్ గారు, రవి శంకర్ గారు ఇంటికి పిలిచి మరి మాకు ఒక బుక్ నా చేతిలో పెట్టారు. అది ప్రజలందరికీ కూడా చాలా ఉపయోగపడుతుంది దాన్ని బాగా స్టడీ చేయమని చెప్పారు ఆ బుక్ డబ్ల్యుహెచ్వో లైఫ్ స్కిల్స్ దాన్ని మేము ప్రిపేర్ అవడమే కాకుండా, ఆ బుక్ మాకెంతో నచ్చి అది ఎంత ఇంపార్టెంటో తెలిసింది. పిన్నకిల్ బ్లూమ్స్ నెట్వర్క్ లో జాబ్ రావడం కూడా నాకు చాలా ఆనందం. మరియు గొప్పగా చెప్పాలి ఎందుకంటే నేను ఎలాంటి జాబ్ గురించి కలలు కన్నానో అదే దొరకడం అంత సులభం కాదు కానీ నాకు దొరికింది . చైర్మన్ డాక్టర్ కోటిరెడ్డి సారిపల్లి గారు సీఈవో శ్రీజ సారిపల్లి గారు వాళ్ళ కలల్లో నాకు చోటిచ్చారు. నేను జాయిన్ అయ్యి మొదలుపెట్టిన రెండు సంవత్సరాల్లోనే నాకు ఒక ఫెసిలిటీ లో నన్ను భాగస్వామ్యం చేసి ప్రోత్సహిస్తున్నారు. అంటే ఒక మనిషికి ఇంతకన్నా విజయం ఇంకేం కావాలి . ఇక్కడ నేను న్యూరో డెవలప్మెంట్ ఆల్ ప్రాబ్లమ్స్ ఉన్న పిల్లలతోనూ అలాగే సైకాలజికల్ ప్రాబ్లమ్స్ ఉన్న పిల్లలకు పెద్దలకు కూడా థెరపీని అందిస్తాను. తర్వాత వాళ్లు లో వచ్చిన డిఫరెన్స్ చూసిన తర్వాత వాళ్ళ ఫ్యామిలీ లో వచ్చిన ఆ ఆనందాన్ని చూసిన తర్వాత చాలా ఆనందంగా ఫీల్ అవటమే కాకుండా ఎప్పుడూ కూడా నాకు అలాంటి నాలెడ్జ్ ని అందించిన నా యొక్క ఫ్యాకల్టీ గాని, నా యూనివర్సిటీ గాని ఎప్పుడు నాకు గుర్తొస్తూ ఉంటాయి. నేనే కాకుండా ఇక్కడ నాతోపాటు ఇంకొక ఐదుగురు నా బ్యాచ్ మేట్స్ ని కూడా నేను నా ఆర్గనైజేషన్ లో జాబులోనికి తీసుకో గలిగాను.

చివరిగా ఒక మాట.. నిజమే కష్టపడి చదవాలి కానీ కష్టం ఒకటే కాదు ఇష్టం కూడా ఉండాలి. సబ్జెక్టు ఇష్టం ఉండి చదివినట్లయితే చదివింది అప్లై చేయడం కూడా నేర్చుకున్నట్లు అయితే మనకి సైకాలజీలో తిరిగే ఉండదు. ఎందుకంటే ప్రతి దాన్ని మనిషి తయారు చేస్తాడు. కానీ ఆ మనుషుల తోటి పనిచేసే అవకాశం ఒక సైకాలజిస్ట్ కి మాత్రమే ఉంటుంది. అలాంటి జాబ్ చెయ్యడానికి మనకి నాలెడ్జ్ కావాలి ఆ నాలెడ్జ్ అందించినటువంటి మంచి ఫ్యాకల్టీ మనకి నన్నయ యూనివర్సిటీ లో ఉంది. కనుక దాన్ని ఉపయోగించుకుంటే ఎంతోమంది దాని ద్వారా లాభం పొందవచ్చు.

– **పాకలపాటి శోభన్ కుమార్**
**(పీహెచ్డీ స్కాలర్ )**
**చీఫ్ తెరపిస్ట్**
**పినాకిల్ బ్లూమ్స్ నెట్వర్క్**
**భారత్ హెల్త్ కేర్ లిమిటెడ్**
**కే.జి.వి గ్రూప్, హైదరాబాద్.**

## ప్రతిభాశాలి డా.ఉమర్ ఆలీషా



**మీడియా సెల్, 24.11.20** శతాబ్దాలుగా పిఠాపురం నుండి దేదీప్యమానంగా పరిఢవిల్లుతున్న శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠానికి ఆరవ పీఠాధిపతి ఉన్న డా. ఉమర్ ఆలీషా సర్వతోముఖ ప్రతిభాశాలి అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మహాకవి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం – ఔపదేశికత్వం" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ అంతర్జాల సదస్సును మంగళవారం ఆన్ లైన్ లో ప్రారంభించారు. ఈ సదస్సు సంచాలకులుగా డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, నిర్వహకులుగా ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. దేశభక్తిగల స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘసంస్కర్త, సామాజిక అభ్యుదయంకోసం నిరంతరం కృషిచేసిన అభ్యుదయవాది అని అన్నారు. మూఢాచారాలను తీవ్రంగా ఖండించడం ఆయన సాహిత్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుందని చెప్పారు.




స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ హయాములో అఖిల భారత శాసనసభకు సభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన శ్రీ ఉమర్ ఆలీషా గారు ఎన్నో సంస్కరణలకోసం కృషిచేశారని తెలిపారు. ఈయనను సామాజిక ఔన్నత్యం కోసం కలంపట్టిన ధీరులుగా అభివర్ణించారు. శ్రీ ఉమర్ ఆలీషా 50కి పైగా రచనలు చేశారని పద్యకావ్యాలు, నాటకాలు, నాటికలు, ఖండకావ్యాలు, పాటలు వంటివి రాసి సమాజాన్ని చైతన్య పరిచారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదవ పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య ఎస్.టికే, ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, సినీనటులు తనికెళ్ల భరణి, ఆచార్య ఆవుల మంజులత, ఆచార్య సుమతీ నరేంద్ర, కొలకలూరి ఆశాజ్యోతి, రసరాజు, విభాగాధ్యాపకులు డా.తలారివాసు, డా.టి.సత్యనారాయణ, డా.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నన్నయ ప్రవేశాలకు విశేష స్పందన : కౌన్సిలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

**మీడియా సెల్, 25.11.20** ఉభయగోదావరి జిల్లాల్లోని పీజీ ప్రవేశం కొరకు నన్నయ సెట్ 2020–21 లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి దశ ఫిజికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని విద్యార్థుల నుండి విశేష స్పందన వస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోని కౌన్సిలింగ్ కేంద్రాన్ని వీసీ పరిశీలించారు. కోవిడ్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ విద్యార్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరపాలని నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఉదయం లైఫ్ సైన్సెస్(101), మధ్యాహ్నం ఫిజికల్ సైన్సెస్(102), తెలుగు(203), జియాలజీ(105) విద్యార్థులకు కౌన్సిలింగ్ జరిగిందన్నారు. 26వ తేది ఉదయం కెమికల్ సైన్సెస్(104), మధ్యాహ్నం కెమికల్ సైన్సెస్(104), హిందీ(204), ఎం.పి.ఈడీ(205) జరుగుతాయన్నారు. 27వ తేది ఉదయం హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(201), ఇంగ్లీషు(202), మధ్యాహ్నం మేథమెటికల్ సైన్సెస్(103), కంప్యూటర్ సైన్సెస్(106)కు సంబంధించిన కౌన్సిలింగ్ జరుగుతాయని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లోని నాలుగు కేంద్రాలలో కౌన్సిలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని విద్యార్థులు తమకు సమీపంలో ఉన్న కేంద్రానికి హాజరు కావచ్చునని అన్నారు. గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రాజమండ్రి, ఎ.కె.ఎన్.యు ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ, సెయింట్ థెరిస్సా ఉమెన్స్ కాలేజ్ ఏలూరు, డి.ఎన్.ఆర్ కాలేజ్ భీమవరంలో జరుగుతున్నాయని తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసిన అనంతరం స్క్రేచ్ కార్డులు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఫీజు వివరాలను వెల్లడించిన తరువాత వెబ్ ఆప్షన్లు పెట్టుకొని ఫీజులు చెల్లించవచ్చునని తెలిపారు. ఆయా కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థులంతా కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతిర్మయి, ఈసీ మెంబర్ డా.సునీత, అబ్జర్వర్ డా.మురళికృష్ణ, ఎస్.రామకృష్ణ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## ప్రాంగణ కళాశాలల విశేషాలు

## యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాగణంలో నాలుగు కళాశాలలు ప్రధానమైనవి. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, విద్యా కళాశాల(ఉపాధ్యాయ శిక్షణ) ఈ సంచికలో ఎడ్యుకేషన్ కళాశాలలోని విభాగాల విశేషాలు. విశ్వవిద్యాలయ ప్రారంభం నుంచి నెలకొల్పిన కోర్సులతో 2006 నుండి ఒకే కళాశాలగా ఉన్న విధానాన్ని అనేక కొత్త కోర్సులు, విభాగాలు ఏర్పాడిన తరువాత 2013 నుండి ఈ కళాశాలలు ప్రత్యేక వ్యవస్థలుగా ఏర్పాడ్డాయి. జెగేట్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నాణ్యమైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా పొందే సదుపాయం ఉంది. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంధాలయంలో అన్ని విభాగాలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్.ఎస్.ఎస్, స్పోర్ట్స్, యోగా విభాగాలలో ఎడ్యుకేషన్ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు. విద్యార్థులకు హాస్టల్, యూనియన్ బ్యాంక్, హాస్పటల్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. యూజీసీ కొన్ని సర్టిఫికెట్టు కోర్సులను ఈ ఏడాది నుండి అందిస్తుంది.







### బి.ఈడీ. కోర్సు

ప్రారభం : 2014
సీట్లు : 50
ఆచార్యులు సంఖ్య : 8
జాతీయ సదస్సుల సంఖ్య : 17
ప్రత్యేకతలు: ఎన్.సి.టి.ఈ గుర్తింపు, బెస్ట్ టీచింగ్ ప్రాక్టీస్, అత్యాధునిక ల్యాబ్స్

### ఎం.పి.ఈడీ. కోర్సు

ప్రారభం : 2017
సీట్లు : 40
ఆచార్యులు సంఖ్య : 6
జాతీయ సదస్సుల సంఖ్య : 6

**ప్రత్యేకతలు:**
ఎన్.సి.టి.ఈ గుర్తింపు,
ఉభయగోదావరి జిల్లాల్లో ఏకైక కోర్సు,
దేశంలో అతి తక్కువ ఫీజు

**ఆల్ ఇండియా స్థాయి విజయాలు**
రోప్ స్కిప్పింగ్ - 18 గోల్డ్ మెడల్స్
వెయిట్ లిఫ్టింగ్ - 3 బ్రాంజ్ మెడల్స్
బాల్ బ్యాట్మెంటెన్ - 1 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్
రిపబ్లిక్ డే పేరెడ్ కు ఒకరు,
ప్రీ రిపబ్లిక్ డే పేరెడుకు ఇద్దరు ఎంపిక.





డా.కె.సుబ్బారావు
ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్


రాష్ట్రంలోనే అన్ని సౌకర్యాలతో అత్యున్నత ప్రమాణాలతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఎన్.సి.టి.ఈ న్యూఢిల్లీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో ఏకైక విద్యాకళాశాల. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యాకళాశాల ఆధ్వర్యంలో భవిష్యత్తు తరాలకు అవసరమగు ఉపాధ్యాయ కోర్సులు ఎం.ఈడీ, బి.పి.ఈడీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, డిప్లమా, సర్టిఫికేట్టు కోర్సులు మొదలైన వాటిని ప్రారంభించడం. ఉపాధ్యాయ విద్యా పరిశోధనను ప్రారంభించి, అభివృద్ధి పరిచి విద్యాపరమైన ఉపాధ్యాయపరమైన సమస్యలకు వివిధ పరిశోధనల ద్వారా పరిష్కారం తెలియజేయడం. శారీరక మరియు మానసిక వికాసం పెంపొందించడంలో వివిధ కళల ద్వారా (ఆర్ట్ ఎడ్యుకేషన్) విద్యార్థులలో సమగ్ర వికాసం పెంపొందించడం. టిఈటి, డి.ఎస్సీ, సిటిఈటి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలకు ప్రత్యేక తర్ఫీదునిస్తూ ఉపాధ్యాయ విద్యార్థులకు అన్ని కోణాలలో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యం.








(ఇవి 2020-2021 విద్యాసంవత్సరం నవంబర్ నాటికి వివరాలు)